వాకింగ్ పార్కులో సమస్యల తిష్ట



గుల్లలపాలెం పార్కులోని వాకింగ్ ప్రదేశంలో వేలాడుతున్న చెట్టు కొమ్మలు



పార్కు ఆవరణలో చెత్తాచెదారం

- ఇటు అంధకారం.. అటు అపరిశుభ్రత
- ఇబ్బందులు పడుతున్న వాకర్స్
- పట్టించుకోని అధికారులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెంలోని వాకింగ్, సైకిలింగ్ పార్కులో సమస్యలు తిష్ట వేశాయి. ఆరోగ్య రక్షణ కోసం ప్రతి రోజూ ఇక్కడికి వాకింగ్‌కు వస్తున్న వారు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీవీఎంసీ నిర్వహిస్తున్న ఈ పార్కులో నెలకొన్న సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక వాకర్లు ఆరోపిస్తున్నారు. మల్కాపురం, శ్రీహరిపురం, నక్కవానిపాలెం తదితర ప్రాంతాల నుంచి రోజూ వంద మందికి పైగా వాకర్స్ ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ పార్కుకు వస్తుంటారు. ఇక్కడున్న విద్యుత్ ఎల్‌ఈడీ లైట్లు ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి మరుసటి రోజు వేకువజాము 5 గంటల వరకు మాత్రమే వెలుగుతుంటాయి. ప్రస్తుత కాలంలో ఉదయం 6 గంటలు అయితేనే గానీ పూర్తిగా వెలుగు రాదు. తెల్లవారు 5 గంటలకే సిబ్బంది ఎల్‌ఈడీ దీపాలను ఆర్పేస్తుండటంతో పార్కులో అంధకారం అలుముకుంటోంది. ఆ సమయంలో వాకింగ్ చేసే వారు ఇబ్బంది పడుతున్నారు.

అధ్వానంగా పార్కు పరిసరాలు..

వాకింగ్ చేసే ప్రదేశాల్లో పెంచిన మొక్కల కొమ్మలు ఏపుగా పెరిగాయి. వాకర్స్ వాకింగ్ చేసే సమయంలో అవి అడ్డుగా తగులుతున్నాయి. వాకింగ్ పార్కు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో చెత్తచెదారంతో నిండి అధ్వానంగా మారాయి. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పారిశుధ్య కార్మికులు పార్కును శుభ్రం చేయాల్సి ఉన్నా.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాకర్స్ ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ స్థలంలో ప్రైవేటు శిక్షణలు..

ప్రభుత్వానికి చెందిన ఈ వాకర్స్ పార్కు మైదానంలో కొందరు ప్రైవేటు వ్యక్తులు కరాటే, బాక్సింగ్ వంటి క్రీడా శిక్షణలు ఇస్తున్నారు. శిక్షణకు వచ్చే వారి నుంచి వందల రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నారు. అంత డబ్బులు తీసుకుంటున్న ఆ నిర్వాహకులు పార్కు పరిశుభ్రతకు ఏమాత్రం దోహదపడరు. ప్రభుత్వ స్థలంలో ఉచితంగా శిక్షణ అందించాల్సింది పోయి.. డబ్బులు వసూలు చేయడమేంటని పలువురు పేర్కొంటున్నారు. ఈ సమస్యలపై సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని వాకర్స్ కోరుతున్నారు.

ఎమ్మెల్సీగా సుధాకర్‌ను గెలిపించాలి



మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఇన్‌చార్జ్ ఆడారి ఆనంద్ ఆదేశాల మేరకు మేరకు 91, 92 వార్డు స్థాయి నాయకులతో గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు కోసం అంతా కృషి చేయాలన్నారు. ప్రతీ గ్రాడ్యుయేట్‌ను కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పనులను వివరించాలని తెలిపారు. ప్రచారంలో ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఓటర్ల నమోదుకు సమయం పొడిగించారని ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని తెలిపారు. సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి, గేదెల మురళీకృష్ణ, రంపర కోటేశ్వరరావు, చుక్క పైడి రాజురెడ్డి, కన్వీనర్లు ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో బుల్లయ్య కళాశాలకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో బుల్లయ్య కళాశాల యాజమాన్యం

సీతంపేట: ఆంధ్రా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 18 వరకు శివాజీ పార్క్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ రోలర్ స్కేటింగ్ పోటీల్లో లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ పోటీలకు ఏయూ తరపు న ప్రాతినిధ్యం వహించిన బుల్లయ్య కాలేజీ విద్యార్థు లు అత్యంత ప్రతిభ చూపి ఆల్ ఇండియా లెవెల్‌లో బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. బీకాం మొదటి సంవత్సరం చదువుతున్న టి.షణ్ముఖ రాకేష్ స్కేట్ బోర్డింగ్ విభాగంలో బంగారు పతకం పొందాడు. బీఎస్సీ థర్డ్ ఇయర్ చదువుతున్న ఎస్.యుక్త వార్డ్ హాకీ విభాగంలో బంగారు పతకం, ఇన్‌లైన్ హాకీ విభాగంలో రజత పతకం, బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్న బి.ఆశ్రిత ఫ్రీస్టైల్ విభాగంలో రజత పతకం, బీఎస్సీ ఫస్టియర్ విద్యార్థి సిహెచ్.వి.పవన్ కార్తికేయ స్కేట్ బోర్డింగ్ విభాగంలో కాంస్య పతకం, బీఎస్సీ థర్డ్ ఇయర్ విద్యార్థి డి.వేణు వర్ధన్ ఆర్టిస్టిక్ ఫ్రీ స్కేటింగ్‌లో కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులను బుల్లయ్య కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.మధుకుమార్‌తోపాటు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.శ్రీకాంత్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సోమేశ్వరరెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి, అసిస్టెంట్ డీన్ టి.బ్రహ్మానంద రెడ్డి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్లు బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి, యు.గంగాభవాని అభినందించారు.

క్లుప్తంగా

రచయిత్రి, చిత్రకారిణి శారదమ్మకు ఘన సత్కారం



శారదమ్మను సత్కరిస్తున్న రచయిత బి.వి.అప్పారావు దంపతులు

కంచరపాలెం: అలనాటి సంచలన నాటక, సినీ రచయిత, పాత్రికేయుడు దివంగత భీశెట్టి లక్ష్మణరావు సతీమణి రచయిత్రి, చిత్రకారిణి భీశెట్టి శారదమ్మను రచయిత బి.వి.అప్పారావు దంపతులు మంగళవారం ఘనంగా సత్కరించారు. భీశెట్టి లక్ష్మణరావు రచతయిగా అనితర సాధ్యమైన ప్రగతి సాధించడంలో శారదమ్మ సహకారం అమూల్యమైనదని అప్పారావు పేర్కొన్నారు. తన రచనా స్ఫూర్తిదాతైన లక్ష్మణరావు భార్య శారదమ్మను సత్కరించుకోవడం గురువు రుణం కొంత తీర్చుకున్నట్లయిందన్నారు. భీశెట్టి వద్ద తాను సినీ రచన నేర్చుకున్న 1975 సమయంలో శారద తనపై చూపిన వాత్సల్యం మరువలేనిదని బి.వి. అప్పారావు గుర్తు చేస్తుకున్నారు.

ప్రజల్లోకి శ్రీశ్రీ మహాప్రస్థానం



శ్రీశ్రీ మహాప్రస్థానాన్ని కార్యకర్తలకు వివరిస్తున్న జగ్గునాయుడు

సింధియా: చదువుదాం.. సమాజాన్ని మారుద్దాం అనే సంకల్పంతో నిర్వహిస్తున్న రెడ్ బుక్స్ డే సందర్భంగా మంగళవారం 62వ వార్డు దుర్గానగర్, 63వ వార్డు క్రాంతినగర్, చింతల్లోవ ప్రాంతాల్లో మహాకవి శ్రీశ్రీ మహాప్రస్థానం కవిత పఠనాన్ని నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ నేటి దోపిడీ సమాజాన్ని మార్చాలంటే మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని పాటించాలన్నారు. శ్రీశ్రీ మహాప్రస్థానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పైడిరాజు, ఆర్.లక్ష్మణమూర్తి, కె.పెంటారావు, భాస్కరరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాత మురళీకృష్ణకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్ నరసింగరావు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మంగళవారం ఆరిలోవ ప్రాంతానికి చెందిన ఎ.మురళీకృష్ణ అనే దాత రూ.1,00,116 విరాళం అందజేశారు. దేవస్థానం తరపున దాతకు అన్నదాన విభాగం సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు బాండ్ అందజేశారు. అధికారులు దాతకు స్వామివారి దర్శనాన్ని కల్పించి ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో అన్నదాన విభాగం సిబ్బంది హరి, తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని బోరు



కాకరలోవలో పనిచేయని తాగునీటి బోరు

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరలోవలో నీటి ఎద్దడితో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ చేతి పంపు మరమ్మతులకు గురై చాలా కాలమైనా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చేతి పంపునకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి



ఎన్‌ఏడీ నుంచి సాకేతపురం వరకు ర్యాలీ నిర్వహిస్తున్న యూనియన్ సభ్యులు

గోపాలపట్నం: కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ నేవల్ ఆర్మమెంట్ డిపో వద్ద నేవల్ ఆర్మమెంట్ సివిల్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాలాపు మారయ్య మాట్లాడుతూ ఒకే దేశం ఒకే రాజ్యాంగం ఒకే పెన్షన్ విధానం ఉండాలని డిమాండ్ చేశారు. కొన్ని రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానం అమలు చేస్తూ మరికొన్ని రాష్ట్రాల్లో కొత్త పెన్షన్ విధానం అమలు చేసేందుకు కేంద్ర యత్నిస్తోందని విమర్శించారు. నేషనల్ ట్రేడ్ యూనియన్ల పిలుపు మేరకు ఫిబ్రవరి 10 నుంచి 20 వరకు సంతకాల సేకరణ చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నేరం



బుచ్చిరాజుపాలెంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

గోపాలపట్నం: గర్భస్థ లింగనిర్ధారణ చట్ట రీత్యా నేరమని బుచ్చిరాజుపాలెం అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలు సీహెచ్ దీపిక అన్నారు. ఈ మేరకు ఈవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం యూపీహెచ్ ప్రాంతంలో సేవ్ ద గర్ల్ చైల్డ్, భేటీ బచావో–భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఏఎన్‌ఎంలు, ఆషా వర్కర్లు, యూపీహెచ్‌ఎస్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఆడ శిశువును కాపాడుకుందాం సృష్టిని రక్షిద్దామని..ఆడపిల్ల వద్దు అనుకుంటే సమాజం అనాథవుతుంది.. ఆడపిల్లల్ని పుట్టనిద్దాం..ఆడపిల్లలను బతకనిద్దాం..ఆడపిల్లల్ని చదవనిద్దాం.. ఆడపిల్లల్ని ఎదగనిద్దాం అంటూ నినిదాలు చేశారు.

నందమూరి నగర్ సమస్యలపై వినతి



బెహరా భాస్కరరావుకు వినతిపత్రం అందిస్తున్న గ్రామ కమిటీ సభ్యులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు నందమూరి నగర్ సమస్యలపై గ్రామ కమిటీ సభ్యులు మంగళవారం జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావుకు గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో వినతిపత్రం అందించారు. తమ గ్రామంలో రహదారులు, కాలువలు అధ్వానంగా ఉన్నాయని, నిత్యం ఇబ్బందులకు గురవుతున్నామని ఆయన ముందు వాపోయారు. దీనిపై స్పందించిన భాస్కరరావు సత్వరమే ఈ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నందమూరి నగర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు నీలాపు మహాలక్ష్మి రెడ్డి, దవళ మోహన్, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను కాపాడుకుందాం



ర్యాలీ ప్రారంభిస్తున్న డాక్టర్ రాజేంద్ర

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కప్పరాడలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా క్షయ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక కార్యక్ర మం నిర్వహించారు. టీబీ వారోత్సవాలు, గర్భస్థ శిశు లింగ నిర్ధారణలపై అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సనపల రాజేంద్ర మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణ కు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. సమాజంలో ఆడ, మగ బేధం ఉండకూడదన్నారు. లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరమని, ఆడ శిశువులను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం రాంజీ ఎస్టేట్, కప్పరాడ, తిక్కవానిపాలెం కాలనీల్లో వైద్య సిబ్బంది ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఎస్టీఎస్ గోవింద్, ఎస్టీఎల్‌ఎస్ శరత్, ఎల్‌టీ పూర్ణిమ, టీబీహెచ్‌వీ నూనెల పైడిరాజు ఆశ వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చోరీకి గురవుతున్న ద్విచక్ర వాహనాలు

మర్రిపాలెం: మర్రిపాలెం శ్యామ్‌నగర్ కాలనీలో మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని ఓ వ్యక్తి ఇంటి ముందు పార్క్‌చేసి ఉన్న ద్విచక్ర వాహనాన్ని దొంగిలించాడు. శ్యామ్‌నగర్ కాలనీకి చెందిన బీలా రవికుమార్ పనులు ముగించుకుని ఎప్పటిలాగే సోమవారం రాత్రి ఇంటి ముందు తన టూ వీలర్‌ను పార్కింగ్ చేశాడు. సోమవారం అర్ధరాత్రి దాటాక రెండు గంటల ప్రాంతంలో ఒక వ్యక్తి నడుచుకుంటూ వచ్చి వాహనంతో పరారయ్యాడు. ఈ ఘటనపై ఎయిర్‌పోర్టు క్రైం పోలీసులను వివరణ అడగ్గా.. బాధిత వ్యక్తి ఫిర్యాదు ఇవ్వడానికి ఇష్టపడలేదని, ఒకసారి వెరిఫై చేసుకున్నాక ఇస్తారని చెప్పినట్టు తెలిపారు.

నెల రోజుల వ్యవధిలో 3..

గత నెలలో రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురైనట్లు ఫిర్యాదు వచ్చిందని క్రైం పోలీసులు తెలిపారు. మొత్తంగా నెల రోజుల వ్యవధిలో 3 ద్విచక్ర వాహనాలు మాయమయ్యాయి. గత నెల 19న వరప్రసాద్, నాగసతీష్ అనే ఇద్దరు యువకుల ద్విచక్ర వాహనాలు దొంగతనానికి గురికాగా, మంగళవారం తెల్లవారుజామున మరో వాహనం చోరీ జరిగింది. దీనికి సంబంధించి పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. రాత్రి పూట ఈ ప్రాంతంలో కనీస గస్తీ లేదని, అర్ధరాత్రి గస్తీ ఏర్పాటు చేసి దొంగతనాల నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు



రచయిత వరలక్ష్మిని సత్కరిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

సీతంపేట: మాతృ భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే రాయాలని పలువురు వక్తలు సూచించారు. 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలోని మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సత్యమాధవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శివ గీతార్చన, కరుణామృత పుస్తకాల రచయిత నారాయణం వరలక్ష్మి, విశిష్ట అతిథులుగా ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు మళ్ల వెంకటరావు, బండే వెంకటేశ్వరరావు విచ్చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని వివరిస్తూ కవితలు, గేయాలు పాడి వినిపించారు. లలిత అ, ఆల గురించి, పేరి భార్గవ్, భాస్కరమ్మ కవుల గురించి వివరించారు. మళ్ల వెంకటరావు మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనాన్ని చాటి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు ప్రాంతీయ భాషలను బోధించాలని సూచించారు. అనంతరం రచయిత వరలక్ష్మిని ట్రస్టు ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్టీ మళ్ల లక్ష్మి, పొలిమేర లక్ష్మీనాయుడు, బండే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



మాతృభాషా దినోత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు

గోపాలపట్నం: మాతృభాష తీయదనాన్ని ప్రపంచానికి తెలియజేసేందుకు యువత కృషి చేయాలని ఆంధ్రా యూనివర్సిటీ న్యాయ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ చల్లా నందగోపాల్ పిలుపునిచ్చారు. గోపాలపట్నం మురళీకృష్ణ డిగ్రీ కళాశాలలో మంగలవారం మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాషను ఈ తరం వారు నిర్లక్ష్యం చేస్తున్నారని, దీన్ని కాపాడుకునేందుకు అందరి కృషి అవసరమన్నారు. కృష్ణ కాలేజీ అధ్యాపకురాలు డాక్టర్ దేవులపల్లి పద్మజా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.ప్రవీణ్, కృష్ణ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించండి



ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

విద్యార్థులతో జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

మురళీనగర్: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడంతోపాటు పూర్తిగా నిషేధించేందుకు విద్యార్థులు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు కోరారు. ప్లాస్టిక్ నిషేధం, తడి–పొడి చెత్త నిర్వహణ అంశాలపై కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో మంగళవారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ కవర్లు భూమిలో కలవడానికి వెయ్యేళ్లు పడుతుందన్నారు. ప్లాస్టిక్ వల్ల జీవజాతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని వివరించారు. ప్లాస్టిక్ స్థానంలో గోనె, కాటన్‌తో తయారు చేసిన సంచులు వినియోగించాలని సూచించారు. ఈ మార్పు విద్యార్థులతోనే ప్రారంభం కావాలన్నారు. ఇంట్లోని తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేరు చేసి ఇచ్చేలా చూడాలన్నారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర వహించాలని కమిషనర్ సూచించారు. ముందుగా కాలేజీ ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, కాలేజీ ప్రిన్సిపాల్ జి.వి.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు



స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో స్కంద పూజలు, అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్ర నామం, విభూది, పుష్పలతో అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు



గౌరీనగర్‌లో అక్రమ కట్టడాన్ని తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు ఊర్వశి జంక్షన్ పరిధి గౌరీనగర్, గోకుల్‌నగర్ ప్రాంతాల్లోని అక్రమ నిర్మాణాలను జోన్–5 టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఐ.వి.రమణమూర్తి ఆదేశాల మేరకు మంగళవారం టీపీవో ఎం.శ్రీలక్ష్మి పర్యవేక్షణలో సిబ్బంది తొలగించారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేపడితే తొలగిస్తామని హెచ్చరించారు. గౌరీనగర్‌లో అనుమతులు లేని మూడో అంతస్తు నిర్మాణ పనులపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో.. 266 సచివాలయం టౌన్ ప్లానింగ్ సెక్రటరీ మజ్జి గోవిందరాజు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో తొలగింపు చర్యలు చేపట్టారు. వార్డులోని ఆయా సచివాలయాల టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు జెట్టీ శోభాలతాదేవి, సత్తిబాబు, కిషోర్‌రెడ్డి, జోన్–5 టౌన్ ప్లానింగ్ సిబ్బంది గుమ్మిడి శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం జీవితంలో భాగం కావాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ

మద్దిలపాలెం : నిరంతర అధ్యయనం, పుస్తక పఠనం ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ అన్నారు. రెడ్ బుక్ డే సందర్భంగా పిఠాపురం కాలనీలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టులు, వామపక్ష వాదులు, కవులు, రచయితలు, అభ్యుదవాదులు, సాహితీ ప్రియులు రెడ్ బుక్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. మనం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మార్గాన్ని చూపించేవిగా మన సాహిత్యం ఎంతో దోహదపడుతుందన్నారు. పార్టీ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు సిహెచ్.ఎల్.ఎన్.శాస్త్రి, జీవీఎన్ చలపతి, జి.ఎ స్.రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అనిశ్చిత పరిస్థితులను సమర్థవంతంగా అధిగమించాలి

ఏయూ క్యాంపస్: అనిశ్చిత పరిస్థితులను సమర్థవంతంగా అధిగమించి రాణించే నైపుణ్యాలను యువతరం పెంపొందించుకోవాలని ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు అన్నారు. మంగళవారం ఏయూ డీసీఎంఎస్ విభాగంలో నిర్వహించిన ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక దినోత్సవం, జాతీయ మేనేజ్‌మెంట్ డే వేడుకలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నిత్యం సమాజం మారుతుంటుందని, దీనిని తెలుసుకుని తదనుగుణంగా నైపుణ్యాలతో సుసంపన్నం కావాలన్నారు. అజినోమోటో బయో ఫార్మా సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్–హెచ్‌ఆర్ డాక్టర్ పి.శ్రీనివాస్ ఠాగూర్ మాట్లాడుతూ సంక్లిష్ట సమయాలలో అనుసరించాల్సిన వ్యూహాలను తెలియజేశారు. మార్పును స్వాగతిస్తూ ముందుకు సాగేవారు నాయకులుగా ఎదుగుతారని చెప్పారు. నిరంతరం అభ్యసనం దీనికి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. మైలాన్ లేబొరేటరీస్ హెచ్‌ఆర్ విభాగాధిపతి జి.సరస్వతీరావు, విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, విశాఖపట్నం మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆచార్య ఎస్.సాంబశివరావు ప్రసంగించారు. వీఎంఏ కార్యదర్శి టి.పి.ఎస్.ప్రసాద్ వందన సమర్పణ చేశారు. వీఎంఏ సభ్యులు, డీసీఎంఎస్ ఆచార్యులు, పరిశోధకులు పాల్గొన్నారు.

కంప్యూటర్ సైన్స్ ఫ్రెషర్స్‌డే పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్, ఐటీ విభాగాల ఫ్రెషర్స్‌డే వేడుకలను వచ్చే నెల 18న నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, విభాగాధిపతులు ఆచార్య కె.వెంకటరావు, ఆచార్య కుంజం నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.